క్లుప్తంగా

ఇష్టంతో విద్యనభ్యసించాలి



విద్యార్థులకు పలకలు అందజేస్తున్న రిటైర్డ్ టీచర్ సురేష్

ఐరాల: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విశ్రాంత ఉపాధ్యాయుడు సురేష్ ఆకాంక్షించారు. గురువారం మండలంలోని కాణిపాకం ప్రాథమిక పాఠశాలలో ఇటీవల సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన సురేష్ తన సొంత ఖర్చులతో 100 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పలకలు ఆ పాఠశాల హెచ్‌ఎం మోహన్ చేతుల మీదుగా అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ దాత సేవలను కొనియాడారు. విద్యార్థులు విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువకుడిపై దాడి కేసు నమోదు

చిత్తూరు రూరల్(కాణిపాకం): బండి రెయిజ్ చేశాడని 17ఏళ్ల బాలుడిని.. ఓ యువకుడు చితకబాదాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చిత్తూరు మండలంలోని తుమ్మింద గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు తుమ్మింద గ్రామానికి చెందిన విమల్ అనే బాలుడు తల్లికి అనారోగ్యానికి సంబంధించిన మందులు కొనడానికి బండి మీద మెడికల్ షాపునకు వెళ్లాడు. బైక్ స్టార్టింగ్ సమస్య కారణంగా బండిని రెయిజ్ చేసుకుంటూ వెళ్లాడు. మెడికల్ షాపు వద్ద అదే గ్రామానికి చెందిన బాలాజీ అనే యువకుడు బండి ఎందుకు రెయిజ్ చేస్తున్నావ్ అని దురుసుగా మాట్లాడాడు. దీంతో విమల్ ఎదురుతిరిగాడు. దీంతో మాటామాటా పెరిగి ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో బాలాజీ విమల్‌ను చితకబాది కులం పేరుతో దూషించి.. బెదిరింపులకు దిగాడు. దీనిపై విమల్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



కృష్ణాపురం హైస్కూల్లో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

తవణంపల్లె: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం ఇచ్చినట్లు తవణంపల్లె ఎంఈఓ హేమలత తెలిపారు. 64 స్కూళ్లలో 2280 మంది పిల్లలకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలకు సరఫరా చేసినట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం అందజేసినట్లు వివరించారు. షూలు మాత్రం సరఫరా కాలేదని, వచ్చిన వెంటనే అందజేస్తామన్నారు.

వీధివీధినా.. శునక సైన్యం



తగ్గువారిపల్లెలో..

- జనాలను హడలెత్తిస్తున్న వీధి కుక్కలు
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వైర విహారం
- ఏది పిచ్చి కుక్కో.. ఏది మంచి కుక్కో తెలియక భయాందోళనలో ప్రజలు
- వీధి కుక్కల నియంత్రణపై పట్టించుకోని అధికారులు

రాత్రి పూట వీధుల్లో వెళ్లాలంటే గుండెలు అదిరిపోతున్నాయి. ఎక్కడి నుంచి హఠాత్తుగా కుక్కలు వస్తాయోనని భయం. గ్రామ సింహాలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. మాంసం, చికెన్, చేపల దుకాణాలు, కోళ్ల ఫారాలు ఉన్న ప్రదేశాల్లో వీధి కుక్కలు మకాం వేసి తమ సంతతిని పెంచుకుంటున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రజలపై వీధి కుక్కల దాడులు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. దాడుల్లో గాయపడిన వారు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స చేయించుకుంటున్నారు.

–బంగారుపాళెం

అరు నెలల కాలంలో నియోజకవర్గంలో 100 మందికి పైగా కుక్క కాటుకు గురయ్యారు. పిచ్చికుక్కల దాడిలో 40 పశువులకు గాయాలయ్యాయి. గత నెలలో మండలంలోని పెరుమాళ్లపల్లె, తుంబకుప్పం గ్రామాల్లో మూడు పిచ్చికుక్కలు స్వైర విహారం చేసి 40 పశువులను కొరికి గాయపరిచిన విషయం తెలిసిందే. దీంతో గ్రామస్తులు హడలెత్తిపోయారు. పిచ్చికుక్కలు ఎవరిని కొరుకుతాయోనని ఇళ్లలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. గ్రామస్తులు, రైతులు పిచ్చికుక్కలను తరిమేశారు. నియోజకవర్గంలోని పూతలపట్టు, ఐరాల, తవణంపల్లె, బంగారుపాళెం, యాదమరి మండలాలలోని గ్రామాల్లో ఏ వీధికి వెళ్లినా వీధికుక్కలు పదుల సంఖ్యలో కనిపిస్తాయి. రహదారులు, మాంసం, చికెన్, చేపల దుకాణాల వద్ద వీటి సంచారం ఎక్కువగా ఉంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు, విద్యార్థులు, పిల్లలు, మహిళలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. వీధుల్లో సంచరిస్తున్న కుక్కల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో వీధుల్లో సంచరిస్తూ అరుపులతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పెంచుకుంటున్న గొర్రెలు, మేకలు, కోళ్లపై కుక్కల దాడులు పెరిగిపోతున్నాయి

పట్టించుకోని అధికారులు

కుక్కల సంతతి పెరగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించే చర్యలపై సంబంధిత పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నా పట్టించుకునే వారు లేరని అంటున్నారు. కుక్కల సంతానోత్పత్తి పెరిగి పోవడంతో గ్రామాల్లో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు.

కుక్కకాటుతో రేబిస్ వ్యాధి

కుక్క కాటుతో మనుషులకు రేబిస్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్లు సూచిస్తున్నారు. కుక్కకాటుకు గురి కాకుండా జాగ్రత్త పడాలని హెచ్చరిస్తున్నారు. కుక్క కాటుకు గురైన బాధితునికి జ్వరం, వాంతులు, విరేచనాలు, తలనొప్పి, గొంతునొప్పి వస్తుందన్నారు. ఫిట్స్, కాళ్లుచేతులు పడిపోవడం(పక్షవాతం), కోమా, పిచ్చిపిచ్చిగా మాట్లాడడం తదితర లక్షణాలు తలెత్తుతాయన్నారు. క్యాన్సర్, మధుమేహం వ్యాధిగ్రస్తులు 28వ రోజున వ్యాక్సిన్ డోస్ తీసుకోవాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కుక్క కరిచిన వెంటనే సబ్బుతో గాయాన్ని శుభ్రం చేసి, దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలి.
- యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.
- గాయాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసి కట్టు కట్టుకోవాలి.
- ఏఆర్‌వీ వ్యాక్సిన్ 0, 3, 7, 14 రోజుల చొప్పున తీసుకోవాలి.
- కుక్క కాటుకు ఆహార నియమాలేవీ లేవు.
- కరిచిన కుక్కను 10 రోజులపాటు గమనించాల్సి ఉంటుంది.
- కుక్క ఆరోగ్యంగా ఉంటే గాయపడిన వారు భయపడనక్కర్లేదు.



గుంతూరు రోడ్డులో



బంగారుపాళెంలో వీధి కుక్కల గుంపు



పద్మావతి నగర్‌లో..

మామిడి వ్యర్థాలతో ప్రజల అవస్థలు



రోడ్డుపై కుళ్లుతున్న మామిడి వ్యర్థాలు

పూతలపట్టు(యాదమరి): గుజ్జు పరిశ్రమలు రైతుల నుంచి తిరస్కరించిన మామిడి వ్యర్థాలను రోడ్డుకి ఇరువైపులా దించేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పేటపల్లి వద్ద ఉన్న ఓ ప్రైవేటు గుజ్జు పరిశ్రమకు రైతులు తాము పండించిన మామిడిని సీజన్ మొదలైనప్పటి నుంచి కొన్ని వందల టన్నులు తీసుకువస్తున్నారు. అయితే గుజ్జు పరిశ్రమల వారు రైతులు నుంచి కేవలం నాణ్యమైన కాయలను మాత్రమే తీసుకుని మిగిలిన కాయలను తిరస్కరిస్తున్నారు. అయితే కొందరు రైతులు, వాహనాల డ్రైవర్లు మామిడి వ్యర్థాలను రోడ్డుకి ఇరువైపులా దించేసి వెళుతున్నారు.దీని వలన సమీప గ్రామాల ప్రజలు వాటి నుంచి వచ్చే దుర్వాసన, ఈగలు బారిన పడి పలు ఇబ్బందులకు లోనవుతున్నారు. దీంతో భవిష్యత్తులో పలు వ్యాధులు ముప్పు పొంచి ఉండే ప్రమాదం ఉంది. ఈ విషయంపై రైతులకు, సంబంధిత వాహన యజమానులకు అవగాహన కల్పించకపోవడం తోనే ఇలా జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత యాజమాన్యం, అధికారులు దీనిపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

పుంగనూరు(చౌడేపల్లె): ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్లను చోరీ చేసిన సంఘటన పుంగనూరు మండలం పిచ్చిగుంట్లపల్లెలో గురువా రం వెలుగులోకి వచ్చింది. వివరాలు..గ్రామానికి చెందిన చెంగమ్మ, నాగవేణిల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌ను కాపర్ దొంగలు పగలగొట్టారు. దానిలోని 25 కిలోల రాగి వైరును చోరీ చేశారు. పొలాల వద్దకు వెళ్లి న రైతులకు ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మెరుగైన సేవలు అందించండి

పూతలపట్టు(యాదమరి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని పూతలపట్టు పేట పాలకొల్లు కొత్తకోట 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లను తనిఖీ చేశారు. అనంతరం విద్యుత్ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో కొన్ని సబ్‌స్టేషన్లలో ట్రిప్పింగ్‌లు అధికంగా ఉన్నాయని చెప్పారు. దీనివలన వినియోగదారులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయలేకపోతున్నామని అన్నారు. లైన్‌మెన్లు సకాలంలో స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. మండలంలో రూ.కోటికి పైగా బకాయిలు ఉన్నాయని, వాటిని త్వరితగతిన వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి, సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ ఆనంద్, ఏఈ నరసింహులు, లైన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, హేమాద్రిరెడ్డి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమానికి రాజీలేని పోరాటం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాజీ లేని పోరాటం చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘాన్ని పటిష్టపరిచి, ఉద్యమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడిగా చిత్తూరుకు చెందిన హరిప్రసాద్‌ను ఎన్నుకున్నామన్నారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మేదర చంద్రను, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా సెల్వకుమార్‌ను నియమించామన్నారు. ఇక దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టేలా కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాజకీయాల్లోనూ బీసీ మహిళలకు కేటాయించే రిజర్వేషన్లను కేంద్రం స్పష్టంగా పేర్కొనాలన్నారు. కులగణన చేయడం ద్వారా అర్హులైన బీసీలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన అభివర్ణించారు. అనంతరం నూతనంగా నియమితులైన వారికి నియామకపత్రాలు అందజేశారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు జ్ఞాన జగదీష్ పాల్గొన్నారు.



కిలోమీటర్ల పొడవునా నిలిచిన మామిడి ట్రాక్టర్లు. (ఇన్‌సెట్) అయ్యో పాపం: ఇలా నిద్రపోవడమూ కష్టమే

ఎంత కష్టం.. ఎంత దైన్యం



అన్‌లోడింగ్ కాకపోవడంతో ట్రాక్టర్ కింద నిద్రిస్తున్న డ్రైవర్లు

- ఫ్యాక్టరీల వద్ద మామిడి రైతుల పడిగాపులు
- మూడు రోజులైనా అన్‌లోడింగ్ కాక అష్టకష్టాలు
- కిలోమీటర్ల పొడవునా నిలిచిన ట్రాక్టర్లు



రోడ్డు పక్కన నిద్రిస్తున్న డ్రైవర్లు, రైతన్నలు

గుడిపాల మండలంలో మామిడి రైతుల కష్టాలు తీరడం లేదు. అసలే ధర పతనం కాయల విక్రయానికి నానా కష్టాలు పడుతున్న రైతన్నలకు మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద రోజుల తరబడి పడిగాపులు మరింత దురవస్థలోకి నెట్టివేస్తున్నాయి. మూడు రోజులైనా ట్రాక్టర్ల నుంచి మామిడి కాయలను అన్‌లోడ్ చేసుకోకపోవడంతో రోడ్డుపై పడి నానా అగచాట్లు పడుతున్నారు. మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద సుమారు 400 ట్రాక్టర్లు, టాసా జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద 300 ట్రాక్టర్లు లోడింగ్ కోసం నిరీక్షిస్తున్నాయి. రోజులు గడుస్తున్నా ఎక్కడ నిలిపిన ట్రాక్టర్లు అక్కడే ఉండాల్సిన పరిస్థితుల మూలాన నిద్రాహారాలు లేక అల్లాడుతున్నారు. అలసిసొలసి కొందరు ట్రాక్టర్ మీదనే డ్రైవింగ్ సీట్లు, మరికొందరు ట్రాక్టర్ కింద, రోడ్ల పక్కన నిద్రించాల్సి వస్తోంది. జిల్లా కలెక్టర్ ప్రతి ఒక్కరికీ భోజన సదుపాయం కల్పిస్తున్నా ఇక్కడెవరూ ఆహార పొట్లాలు కూడా ఇచ్చే దిక్కు లేదు. గురువారం రైతన్నల అగచాట్లను సాక్షి క్లిక్‌మనిపించింది.

–గుడిపాల

ప్రభుత్వం స్పందించకుంటే పోరాటం ఉధృతం



పుంగనూరులో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పుంగనూరు(చౌడేపల్లె): ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేస్తున్న కార్మికులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు గురువారం 13వ రోజుకు చేరాయి. వారు మాట్లాడుతూ, తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని, 12 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని విమర్శించారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీరాములు, విజయ్‌కుమార్, శైలజ, వెంకటరమణ, సుబ్రమణ్యం, చంద్రశేఖర్, జగన్నాథరెడ్డి, ఆంజప్ప, మురళి, సుదర్శన్‌రాజు, శ్రీనివాసులు, హరి, జయకుమార్, శ్రీకాంత్, నాగిరెడ్డి, దాము, సురేంద్ర, బోయకొండప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణపై కేసు పెట్టాలి



మాట్లాడుతున్న పరదేశి

కాణిపాకం: తనను సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై కేసు నమోదు చేయాలని కాణిపాకం గంగమ్మ జాతర కమిటీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు పరదేశి అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో జాతర వేడుక నిర్వహణకు ధర్మకర్తగా తాను ఉన్నానని చెప్పారు. గ్రామంలోని అగ్రకులస్తులు ప్రజలను భయపెట్టి తనతో కలవనీయకుండా బహిష్కరించేలా చేశారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు

- మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్చరిక

చిత్తూరు అర్బన్: మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. చిత్తూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గురువారం కూడా మునిసిపల్ కార్మికులు ఆందోళన చేశారు. వాటర్, పార్క్, వెహికల్ డిపో మెకానికల్, డ్రైవర్లు, క్లీనర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, స్ట్రీట్ లైటింగ్, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, డ్రైయినేజీ, మలేరియా విభాగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శరవణ మాట్లాడుతూ, 36 జీఓ ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు, 12వ పీఆర్సీ ప్రకారం మునిసిపల్ కార్మికులకు జీతాలు పెంచాలని, తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు తమకూ వర్తింపచేయాలన్నారు.లేని పక్షంలో జూలై 4 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డి.శివకుమార్, కోశాధికారి కే.ఆర్. శివప్రసాద్, గౌరవ సలహాదారు పి.వెంకటేష్, ఉపాధ్యక్షుడు ఎం.హరికృష్ణ, ఎన్.వెంకటేష్, జాయింట్ సెక్రటరీ టి.గోపాలాచారి, ఏ.ఉష, యూనియన్ సభ్యులు కేవీ.సునీల్ కుమార్, పి.శంకర్, ఎస్.పీరుల్లా, ఎం.వేలు, కే.సుజాత, వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న పీవీకేఎన్ ప్రిన్సిపల్ జీవనజ్యోతి



మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కారాదని సీనియర్ సివిల్ జడ్జి భారతి అన్నారు. గురువారం పీవీకేఎన్ కాలేజీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ, ఇటీవల కాలంలో ఎక్కువ మంది యువత మాదక ద్రవ్యాలకు బానిసలవుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగి, వాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. ప్రిన్సిపల్ డాక్టర్ జీవన జ్యోతి మాట్లాడుతూ, యువత పొగాకు ఉత్పత్తులకు కూడా దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలు, మద్యపానం వంటి వ్యసనాలు బారినపడితే బయటపడటం చాలా కష్టమన్నారు. అనంతరం విద్యార్థులతో గాంధీ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, లీగల్ క్లబ్ సమన్వయకర్త నవనీశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు హరిప్రసాద్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు అంధకారమవుతుందని అపోలో మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జయప్రియ అన్నారు. చిత్తూరు అపోలో యూనిర్సిటీలో స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం–అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త డాక్టర్ జయప్రియ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్య అని వ్యాఖ్యానించారు. మత్తు పదార్థాలతో వ్యక్తిగత ఆరోగ్యం, బాధితుల కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని, యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా 297 మిలియన్ల మంది మాదక ద్రవ్యాల బారిన పడుతుంటే, మన దేశంలో వీరి సంఖ్య 57 మిలియన్లకు పైగా ఉందని చెప్పారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు, ప్రభుత్వం సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ భాస్కర్‌రెడ్డి, సీనియర్ ప్రొఫెసర్ భాస్కర్‌నాయుడు, ఈవెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుతో బంగారు భవితను కోల్పోవద్దు

పూతలపట్టు(యాదమరి): మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తు కోల్పోరాదని పూతలపట్టు ఎస్ఐ కృష్ణ మనోహర్ అన్నారు. గురువారం ఆయన జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి రాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మత్తు పదార్థాలు చాపకింద నీరులా ప్రతి ఇంటిలోకి ప్రవేశిస్తున్నాయని అన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు సేవించినా, సరఫరా చేసినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆ వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. తద్వారా మత్తు పదార్థాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరేడు కాయల మార్కెట్‌గా ఆస్పత్రి!



ఆస్పత్రి వద్ద నేరేడు కాయల వ్యాపారం

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాసుపత్రి ముందు గురువారం అల్లనేరేడు కాయల మార్కెట్‌ను తలపించింది. మండలంలోని వివిధ ప్రాంతా ల నుంచి ఆటోలలో అల్లనేరేడు కాయలు తీసుకొచ్చి, ఆసుపత్రి ఆవరణలో బాక్సుల్లో నింపి, బొలెరో వాహనంలోకి లోడింగ్ చేశారు. రోగులు లోపలికి వెళ్లేందుకు అడ్డుగా ఉండడంతో ఇబ్బందులు పడ్డారు. 108 అంబులెన్సు వెళ్లే ప్రదేశంలో ఈ వ్యాపారం సాగించారు. ఆసుపత్రి ప్రదేశంలో మార్కెట్ నిర్వహించడం ఏమిటని? పలువురు మండిపడ్డారు.

పంటలపై ఏనుగుల దాడి



ఏనుగులు ఆరగించిన అరటి చెట్లు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం పంచాయతీ పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు గురువారం రాత్రి పంటపై దాడి చేసి నష్టం కలిగించాయి. పాళెం పంచాయతీ సమీప అటవీ ప్రాంతంతో తిష్ట వేసిన దాదాపు 14 ఏనుగుల గుంపు ఈ పరిసర ప్రాంతాల్లోనే తిరుగుతున్నాయి. వీటికి మరో మూడు ఏనుగులు జత చేరినట్లు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.పాళెం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రాత్రి పూట బయట సంచరించవద్దని, అప్రమత్తంగా ఉండాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చిత్తూరు – పూతలపట్టు :
95539 55610